క్లుప్తంగా

నేడు మిడ్జిల్‌కు ఎంపీ రాక

మిడ్జిల్: మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించడానికి శనివారం ఎంపీ డీకే అరుణ వస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షులు నరేష్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని బీజేపీ, నాయకులు, కార్యకర్తలు అధి సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



జడ్చర్ల: బీఆర్‌ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు శుక్రవారం జడ్చర్లలోని అంబేడ్కర్‌చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అసెంబ్లీలో విపక్ష బీఆర్‌ఎస్ పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ఈ సందర్భంగా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నందకిషోర్‌గౌడ్, బీకేఆర్, దేవ, ప్రశాంత్‌రెడ్డి, నాగిరెడ్డి, మురళి పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలకు అధ్యాపకులు

మహమ్మదాబాద్: మహమ్మదాబాద్‌లో కొత్తగా మంజూరైన ఇంటర్ కళాశాలకు అధ్యాపకులను నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేందర్ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ కమిషన్ ద్వారా నూతనంగా 8 మంది అధ్యాపకులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఇంగ్లిష్, హిందీ, గణితం, భౌతిక, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, చరిత్ర సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులను కేటాయించినట్లు ఆయన తెలిపారు. అందుకు చుట్టూ ఉన్న మండలాల విద్యార్థులు కళాశాలలో చేరి తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. పది పాసైన విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు.

'వీరభద్ర వ్రతకల్పం' గ్రంథావిష్కరణ

నవాబుపేట: మండలంలోని లోకిరేవు గ్రామంలో ఆదివారం ఉమాపతయ్యస్వామి రచించిన వీరభద్ర వ్రతకల్పం గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ప్రధాన పూజారి లింగయ్యస్వామి తెలిపారు. శుక్రవా రం ఆయన మాట్లాడుతూ గ్రంథావిష్కరణ కా ర్యక్రమానికి ప్రత్యేక అతిథిగా డాక్టర్ చెన్నబసవ ప్రభు మహాస్వామి విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి దేవాలయ ఆవరణలో 108 మంది దంపతులతో సామూహిక వీరభద్రవ్రత కార్యక్రమం ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఒంటి పూట బడులు

దేవరకద్ర: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటి పూట బడులు ఉంటాయని ఎంఈఓ బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు ఉంటాయని, మధ్యాహ్న భోజనం తిన్న తరువాత విద్యార్థులను ఇళ్లకు పంపిస్తామని తెలిపారు. అన్ని పాఠశాలలో ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటి పూట బడులు ఉంటాయని తెలిపారు. దేవరకద్ర బాలుర, బాలికల, శ్రీవాణి శిశుమందిర్ పాఠశాలలు ఎస్‌ఎస్‌సీ పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఈ నెల 21 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నడుస్తాయని తెలిపారు.

సాధించాలనే తపన ఉండాలి

జడ్చర్ల టౌన్: జీవితంలో ఏదైనా సాధించాలనే తపన ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని హైదరాబాద్ సీఎస్‌సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్, సామాజిక వేత్త పీవీపీ అంజలికుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక స్పష్టమైన లక్ష్యం పెట్టుకోవాలని, దానిని సాధించేందుకు భిన్నమైన ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. హైదరాబాద్ ఎస్‌ఆర్‌డీజీ స్కూల్ ప్రిన్సిపాల్ రాధారాణి, మన సేవాసమితి అధ్యక్షుడు వేణుగోపాల్, కేజీబీవీ ఎస్‌ఓ తభసమ్‌లు పాల్గొన్నారు.

'గ్రామాల భారం మాకొద్దు'

రాజాపూర్: ప్రతినెల సకాలంలో బిల్లులు రాకపోవడంతో గ్రామాల్లో గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్ పోయించేందుకు తమ వద్ద రూపాయి లేదని, ఈ భారం మోయలేమని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఇంటింటి నుంచి చెత్తను సేకరించేందుకు ఉన్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు ప్రతిరోజు కావల్సిన డీజిల్ లేకపోవడంతో కార్యదర్శులు ఎవరికీ చెప్పుకోలేక మనస్సులోనే మదనపడుతున్నట్లు పేర్కొన్నారు. రాజాపూర్ మండలంలోని 24 గ్రామ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి ఇలాగే ఉంది. గతంలో గ్రామ సర్పంచ్‌తో పాటు పాలకవర్గం బిల్లులు రాకపోయినా సర్పంచ్‌లు తమ చేతుల నుంచి ట్రాక్టర్లకు డీజిల్ పోయించి వచ్చినప్పుడు బిల్లులు తీసుకునేవారు, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.



పాన్‌చౌరస్తాలో హమాలీ సంఘం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు



జిల్లా కేంద్రంలోని మర్లులో హోలీ ఆడుతున్న మహిళలు



జడ్చర్ల పద్మావతి కాలనీలో హోలీ సంబరాలు

రంగుల కేళి.. హోలీ

- గురువారం అర్ధరాత్రి కాముడి దహనం
- రంగుల్లో మునిగితేలిన యువత
- గల్లిగల్లీలో ఘనంగా హోలీ సంబరాలు
- సంబరాల్లో పాల్గొన్న ప్రముఖులు

సాక్షి, నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఏనుగొండ సాంబశివాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఏ.ఆనంద్‌కుమార్‌గౌడ్ హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రం భగీరథకాలనీ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. హౌజింగ్‌బోర్డు కాలనీలో హోలీ వేడుకలు నిర్వహించారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ ఆధ్వర్యంలో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో హోలీ వేడుకలను నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పాత గ్రంథాలయం వద్ద ఉన్న హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బ్యాండ్ మేళాతో అక్కడి నుంచి క్లాక్‌టవర్ చౌరస్తా వరకు వెళ్లి హోలీ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు మద్దియాదిరెడ్డి, ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్ మండలంలోని గ్రామాల్లో యువకులు బ్యాండ్ వాయిద్యాలకు నృత్యాలు చేసి హోలీ సంబురాలు నిర్వహించారు.
- దేవరకద్ర మున్సిపాలిటీలోని పలు వాడల్లో చిన్నలు పెద్దలు రంగుల్లో మునిగి తేలారు. గురువారం అర్ధరాత్రి తరువాత ప్రధాన కూడళ్లలో కాముడి దహనం చేశారు.
- నవాబుపేట, కొల్లూర్, ఇప్పటూర్, యన్మన్‌గండ్ల, లింగంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో హోలీ నిర్వహించారు.
- జడ్చర్లలో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఉత్సాహంగా ఆట పాటలతో చిందేశారు. హోలీ సందర్భంగా మాంసం విక్రయ కేంద్రాలు రద్దీగా మారాయి. గురుకులాలు, హాస్టల్స్ భవనాల్లో వేడుకలు నిర్వహించారు.
- అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో చిన్నా, పెద్ద తేడా లేకుండా రంగులను చల్లుకుంటూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.
- రాజాపూర్, తిర్మలాపూర్, రంగారెడ్డిగూడ, రాయపల్లి, చొక్కంపేట్ గ్రామాల్లో హోలీ వేడుకలు నిర్వహించారు.
- మిడ్జిల్ మండలంలో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకోని డీజేలతో డ్యాన్స్‌లు చేశారు.
- చిన్నచింతకుంట, చిన్నవడ్డేమాన్, దమగ్నాపురం, కురుమూర్తి, అప్పంపల్లి, తిర్మలాపూరం, లాల్‌కోట, బండ్రపల్లి గ్రామాల్లో యువకులు పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు.
- మహమ్మదాబాద్ మండలంలో యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ గ్రామాల్లో ఊరేగింపు చేశారు.
- కోయిల్‌కొండ మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- హన్వాడ మండలంలో యువకులు, పిల్లలు ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు.



ఎస్‌ఆర్‌నగర్ కాలనీలో..



కోయిల్‌కొండలో హోలీ వేడుకల్లో యువకులు



హోలీ సంబరాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



జడ్చర్ల సరస్వతీ నగర్‌లో..



మహబూబ్‌నగర్ బాయమ్మతోటలో..



మహబూబ్‌నగర్‌లో హోలీ ఆడుతున్న యువకులు



ఎంవీఎస్ కళాశాల మైదానంలో..



బస్వాయిపల్లిలో హోలీ రంగులు చల్లుకుంటున్న ఉపాధి కూలీలు



మూసాపేటలో హోలీ వేడుకలు నిర్వహిస్తున్న యువకులు



రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలో..



వీరన్నపేటలో..



జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో..

అట్టహాసంగా ర్యాకమకొండ బ్రహ్మోత్సవాలు



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

హన్వాడ: మండలంలోని ర్యాకమకొండపై వెలసిన తిరుమలనాథుని బ్రహ్మోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కోయిల్‌కొండ, మహమ్మదాబాద్, గండేడ్, కోస్గి, నారాయణ పేట, మహబూబ్‌నగర్ మండలాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ర్యాకమకొండ బ్రహ్మోత్సవాలకు మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిదులు, కార్యకర్తలు ఉన్నారు.

నాడు టాపర్ - నేడు గెజిటెడ్ జూనియర్ లెక్చరర్



సంగారెడ్డి కళాశాలలో ప్రిన్సిపాల్ నుంచి గ్రీన్ పెన్ను స్వీకరిస్తున్న ఫజిలత్

జడ్చర్ల టౌన్: 2010లో మండలంలోనే ఉర్దూ మీడియం టాపర్‌గా నిలిచిన గులఫ్‌షా ఫజిలత్ నేడు సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల గెజిటెడ్ జూనియర్ లెక్చరర్‌గా నియమితులయ్యింది. పట్టణానికి చెందిన ఫజిలత్ 2010లో ఉర్దూ మీడియంలో 507 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. తరువాత మహబూబ్‌నగర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసింది. పాలమూరు యూనివర్సిటీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో పీజీ(క్యాంపస్ ఫ్రీ సీట్), అక్కడే ఎంఎడ్ పూర్తి చేసింది. ఏడాదికాలంగా పీయూలో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేస్తోంది. ఇటీవల టీఎస్‌పీఎస్‌సీ ప్రకటించిన జూనియర్ లెక్చరర్ల నియామకంలో సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెజిటెడ్ కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్‌గా నియమితులైంది. ఈ మేరకు వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ జయప్రదబాయి ఈనెల 12న జేఎల్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం సంగారెడ్డి కళాశాలలో విధుల్లో చేరింది. ఈ సందర్భంగా అక్కడి ప్రిన్సిపాల్ గ్రీన్‌పెన్ను అందించి స్వాగతం పలికారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, చదువునేర్పిన గురువుల సహకారం, భర్త తోడు వల్లనే తాను జేఎల్ సాధించానని ఫజిలత్ 'సాక్షి'కి తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



అయ్యప్పస్వామి పూజల్లో పాల్గొన్న గురుస్వాములు

జడ్చర్ల టౌన్: హరిహరపుత్రుడు అయ్యప్పస్వామి జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం పట్టణశివారులోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పసేవాసమితి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి స్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించి అలంకరణ చే శారు. వేడుకలకోసం ఆలయాన్ని పూలతో ము స్తాబు చేశారు. వేడుకల్లో అయ్యప్పస్వామి సేవాస మితి అధ్యక్షులు రంజిత్‌బాబు, గురుస్వాములు దాచేపల్లి చంద్రయ్య, దేవా, పర్వత్‌రెడ్డి, నర్సింహులు, రాఘవేందర్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి గ్రామంలో కొత్తకోట దయాకర్‌రెడ్డి స్మారకార్థంగా వీర హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రాత్రి ముగిశాయి. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 జట్లు పాల్గొన్నాయి. పోటీలను ఉదయం మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. అర్ధ రాత్రి వరకు పోటీలు కొనసాగాయి. ఈ పోటీలలో అమరచింత మండలం మూ లమల్ల గ్రామం జట్టు ప్రథమ స్థానంలో విజేతగా నిలిచింది. రెండో స్థానంలో మక్తల్ జట్టు, మూడో స్థానంలో కురుమూర్తి గ్రామం జట్టు, నాలుగోవ స్థానంలో పెబ్బేరు మండల్ కంచిరావు పల్లి గ్రామ జట్లు నిలిచాయి. మొదటి బహుమతి రూ. 10 వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ.5 వేలు, నాలుగో బహుమతి రూ.3 వేలు, సీల్డు విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ పో టీల నిర్వహకులు భాస్కర్‌గౌడ్, రాజు నాయుడు, కబడ్డీ కోచ్ మల్లేష్, ఉన్నారు.

ఘనంగా రామలింగేశ్వర స్వామి పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని దళితవాడ సమీపంలోని రామలింగేశ్వరస్వామికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా పలువురు భక్తులు పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను ఆలయంలోనే ఊరేగింపు నిర్వహించి కల్యాణకట్టపై ప్రతిష్ఠించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

బసవేశ్వర ఆలయంలో రథోత్సవం



నవాబుపేట: ఆది దేవుడిగా వెలసిన ఆదిబసవేశ్వర స్వామి ఉత్సవాల్లో శుక్రవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గురుకుంట, పల్లెగడ్డలో వెలసిన స్వయంభు ఆది బసవేశ్వర ఉత్సవాల్లో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో గురుకుంట, పల్లెగడ్డ, కామారం, పోమాల్, దరిపల్లి, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త భూపాల్‌రెడ్డి, పూజారి శ్రీశైలం, జంగయ్య, రాజలింగం, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, రవి, పురుషోత్తం, శ్రీను, చంద్రకాంత్ పాల్గొన్నారు.

'మార్క్సిజమే ప్రత్యామ్నాయం'

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నేటి పెట్టుబడిదారి వ్యవస్థకు మార్క్సిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు అన్నారు. శుక్రవారం కారల్ మార్క్స్ 142వ వర్ధంతి సభ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి ఏ.రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏ.రాములు, కిల్లె గోపాల్ మాట్లాడు తూ కార్యాచరణను ప్రపంచానికి కారల్ మార్క్స్ అందించారన్నారు. ప్రపంచమంతా దారిద్ర్యం, ఆకలి చావులు, ఆత్మహత్యలు, ఆర్థిక అసమానతలు తీవ్రమైన దోపిడీకి వ్యతిరేకంగా ప్రపంచమంతా అనేక తిరుగుబాట్లు జరిగాయన్నారు. మార్క్సిజం ఆధారంగా ఏర్పడ్డ దేశాలు చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తరకొరియా, లావోస్ దేశాల్లో ఆర్థిక సంక్షోభం నుంచి తట్టుకొని స్థిరంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి చైనా సోషలిజానికి మధ్య వైరుధ్యం తీవ్ర రూపం దాలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బి చంద్రకాంత్, కే ప్రశాంత్, వీరాంజనేయులు, ఖమర్ అలీ, భరత్, నందు, ప్రవీణ్, భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏ.రాములు

కాంగ్రెస్‌పై బురద చల్లడం మానుకోవాలి

దేవరకద్ర: కాంగ్రెస్ పార్టీపై బురద చల్లడం మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారూఖ్, నాయకులు ఆదిహన్మంతరెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు హెచ్చరించారు. శుక్రవారం దేవరకద్రలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోయిల్‌సాగర్ పాత ఆయకట్టు పరిధిలో లేని భూముల గురించి బీఆర్‌ఎస్ నాయకులు పని గట్టుకుని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. యాసంగిలో విడతల వారీగా పాత ఆయకట్టుకే సాగు నీరందిస్తామని అధికారులు ముందుగానే ప్రకటించి నప్పటికీ పాత ఆయకట్టు పరిధిలో లేని డోకూర్ తదితర ప్రాంతాల రైతులు వరి పంటలు వేసుకోవడం జరిగిందన్నారు. పదేళ్లలో యాసంగి పంటల సాగు పాత ఆయకట్టుకే పరిమితం అయిన సంగతి మరిచి రైతులను రెచ్చగొట్టే పనిలో బీఆర్‌ఎస్ నాయకులు దిగజారుడుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆరుతడి పంటలకే నీటిని విదిలే విధంగా షెడ్యూలు ప్రకటించారని, ఈ విషయంలో రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో వేణుగోపాల్ రెడ్డి, నర్వశ్రీనివాస్‌రెడ్డి, రాంపాండు, వర్మ, రాము, చంద్రమౌలి, అర్జునచారి పాల్గొన్నారు.



దేవరకద్రలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పట్టణంలో పలుచోట్ల ఇఫ్తార్

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసంలో పట్టణంలోని పలు చోట్ల శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మజీదులతో పాటు కాలనీల్లో ఇఫ్తారు నిర్వహించారు. జిల్లా కేంద్రం క్లాక్‌టవర్‌లోని రహెమత్ మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పలువురికి ఖజూర్, పండ్లు తినిపించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, ముస్లిం సంఘాల ప్రతినిధులు అవేజ్ అహ్మద్, ఇమ్రాన్, అక్బర్, అజ్మత్‌అలీ, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న కొత్వాల్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు